# మూగవేదన

కోడెవయస్సులో వున్న ప్రొద్దు కాలుదువ్వుతూ రంకె వేస్తున్నట్లుగా కన్ను చెదిరే ఎర్రని ఎండను కాయిస్తోంది. ఆకలిమంటకు చల్లని ఓదార్పువలె అడపాదడపా వీచే శీతల పవనాలు వాతావరణపు ఉష్ణోగ్రతను అదుపు ఆజ్ఞల్లో పెడుతున్నాయి.

షావుకారు శివరామప్రసాద్ గారి నిమ్మతోటకు దగ్గరుండి నీటితడి కట్టిస్తున్నాడు గంగన్న. నీళ్ళ ఇంజను మోతబెడుతూ జోరుగా ఆడుతోంది. అయిదంగుళాల పైపులోంచి బావిలోని నీరు వడిగా వచ్చి, చేనుగట్టు ప్రక్క పెద్ద కాలువలో పడుతుండగా పిల్ల కాలువల ద్వారా చెట్ల పాదులకు నీరు సరఫరా అవుతోంది. నీళ్ళకోసం ముఖంవాచి, ఎన్నాళ్లుగానో దరఖాస్తులు పెట్టుకున్నట్లు అందీ అందగానే నిమ్మచెట్లు ఆత్రంగా తమలోకి పీల్చుకుంటున్నాయి. నీర్కావి పంచె పైకెగగట్టి, గంపతలగుడ్డ బిగుతుగా చుట్టి, బాణం బద్దలా నడుంవంచి నిమ్మచెట్టు పాదుకు నీటి జాలు చేస్తున్న గంగన్న అల్లంత దూరాన పోస్టుమాన్ సుబ్బయ్యను చూచి గబగబా పిల్లకాలువలో బురదచేతుల్ని కడుక్కొని కట్టుపంచెకు తుడుచుకుంటూ గనుమెక్కాడు.

పోస్టుమాన్ సుబ్బయ్య ఇచ్చిన ఉత్తరాన్ని తీసికొని సంతృప్తిగా నవ్వుకున్నాడు గంగన్న చెట్టునవున్న పువ్వు గాలికి స్వేచ్ఛగా నవ్వుకున్నట్టు. అబ్బాయికాడనుంచి వొచ్చిన ఉత్తరమే! ఏంరాశాడో ఎట్లా చదువుతున్నాడో! ఆరోగ్యం బాగావుందో, లేదో. ఈయేటికి ఒడ్డున

బడితే, పంట చేతికి వొచ్చినట్టే. మనస్సు ఆదుర్దాతో అల్లల్లాడగా గంగన్న నిమ్మతోటకు నీటి తడి కట్టేపనిని తాత్కాలికంగా షావుకారు గారి పెద్ద పాలేరుకు అప్పగించి ఆ ఉత్తరాన్ని బొడ్లో దోపుకుని, పెద్ద పెద్ద అంగలు వేసికుంటూ షావుకారుగారి మేడకేసి వెళ్లాడు.

నిమ్మతోటకు మొగదల్లోనే గంగన్న నివాసముండే గుడిసె. దాని ప్రక్కన అందమైన పూలతోట, ఆ తోట సమీపానే షావుకారు శివరామ ప్రసాద్ గారి మూడంతస్థుల భవనం. గంగన్న చిన్నప్పట్నుంచీ ఆ తోటల్లోనూ, మేడలోనూ, షావుకారుగారి గడ్డమీదనూ పెరిగాడు. గంగన్న తండ్రి చివరిరోజువరకూ ఆ కుటుంబాన్ని, వూడిగం చేసికొని నిశ్చింతగా కాలం వెళ్ళబుచ్చిన మనిషి. ఆ వరవడిలోనే గంగన్న బ్రతుకు నడుస్తోంది. తోటకాపరిగా వుంటున్నాడు. జీవితసర్వస్వాన్ని షావుకారి గారికి అర్పించి, నమ్మిన బంటులాగా, చెట్టుక్రింద మొక్కలాగా, నీడ పొడవలె చీకూచింతా లేకుండా జీవిస్తున్నాడు. మానవజన్మ ఎత్తాక ఎవరైనాసరే, కష్టించి చమటోడ్చి పనిచేయాలి. అప్పుడే జీవితానికి అర్థమూ, సార్థకతా, మాధుర్యమూ శాంతి సౌఖ్యాలూ లభిస్తాయి. ఆ సిద్ధాంతపు వెలుగులో తనబాటను నిర్దుష్టం చేసికున్న వ్యక్తి. గతంకన్న, నీతి నిజాయితీలకు నిలబడి నీళ్లు త్రాగే శిష్టస్వభావి. వయస్సు సాయం సంధ్యగా పడినప్పటికీ కండపుష్టి, శరీరదార్ఢ్యతా సడలనివాడు. ఇప్పటికీ పగలంతా శ్రమజేయనిదే నిద్రపట్టదు. ఉక్కుస్తంభంలాంటి మనిషి. ఆరడుగుల రెండంగుళాల పొడవుగల భారీవిగ్రహం. గళ్లైపుటక, ముఖం టేకుచెక్కలా వున్నా కరుణార్ద్రితేగాని కాఠిన్యత కనుపించదు. కోటేరులాంటి ముక్కు, జీవితంలో గౌరవించే న్యాయదృష్టికి దృష్టాంతరం; భీకరమైన కుచ్చు మీసాలు ప్రవర్తనలో నీతినిజాయితీల కరుణరసాన్ని చాటుతాయి; శాంతినిలయాలైన, గంభీరమైన ఆయన నేత్రాలు మానసిక ఔన్నత్యానికి గీటురాళ్లు; మైదానంలాంటి విశాలమైన ఆ వక్షస్థలం ఆత్మవైశాల్యానికి నిదర్శనం. గంగన్న ఎప్పుడూ చొక్కా వేసికోడు. పెళ్ళినాడేమైనా ధరించాడేమో! మొదటినుంచీ ఆడంబరాలపై మోజులేదు వినయమూ, విధేయతా, తాను నమ్మిన వ్యక్తులపై అచంచలమైన విశ్వాసమూ

గౌరవమూ, నీతినియమాల రక్షణలో బాధ్యతా కర్తవ్యాలు కలిగివుండటమే ఆయన వ్యక్తిత్వంలోని విశిష్టత. నిర్మలమైన అంతఃకరణ వుంటే మనిషికి ఆడంబరాలెందుకు ?

గంగన్నకు ఒక్కడే కొడుకు. ఆ పిల్లవాడు కలిగిన ఏడాదికి భార్యకు మసూచికం వొచ్చి చనిపోయింది. మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. ఇప్పుడు గంగన్న కొడుకు సాంబు కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీలో బి. ఇ. ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. "మా వాడింత వాడు కావడానికి పెదబాబుగారే కారణం. ఆరి అండా ఆపూ లేకపోతే నాకుమల్లేనే వాడు కూడా గడ్డను నమ్ముకొని బతకాల్సి వచ్చేది. ధర్మప్రభువులు. ఆయనగారు మాకు దేవుడిలాంటి మడిసి" అంటూవుంటాడు గంగన్న. సాంబుకు మొదటనుంచీ షావుకారుగారే చదువు చెప్పిస్తున్నారు. ఎన్ని వేల రూపాయల్లు ఖర్చు అయినా ఆయనకి పట్టింపేలేదు. శివరామప్రసాద్ గారికి చదువుకొనే వాళ్ళంటే మహా యిష్టం, ఆసక్తి, అభిలాషా వుండి ఆర్థిక యిబ్బందులవల్ల చదువలేకపోయేవారిమీద ఆయనగారికి అమితమైన జాలీ, సానుభూతి. అల్లాంటి వారికి విరివిగా సహాయం చేస్తూండడం ఆయనగారికెంతో ఆత్మసంతృప్తి. తన ఒక్కగానొక్క కొడుక్కి చదువుపైగల అశ్రద్ధా, నిర్లక్ష్య భావమూ ఆయనగారిలో ఆ ధర్మబుద్ధిని ఇనుమడింపజేశాయి.

షావుకారు శివరామప్రసాద్ గారు ముందు గదిలో పడక కుర్చీలో కూర్చుని చేబ్రోలు పుగాకు చుట్ట కాలుస్తున్నారు. అప్పుడే భోజనం చేసినట్టుంది. గంగన్న చేతులుకట్టుకొని సవినయంగా నిలబడి, బొడ్లోని వుత్తరం తీసి అందించాడు.

"ఇప్పుడే వొచ్చింది బాబుగోరూ! మా వాడు రాసిందేనా ?" కొడుకు దగ్గర్నుంచి ఎప్పుడు ఏ వుత్తరం వచ్చినా షావుకారుగారికిస్తాడు. అయనగారు చదివి చెబితేగాని గంగన్న మనస్సుకు స్వాస్థ్యం చిక్కదు.

షావుకారు శివరామప్రసాద్ గారు ఆ లేఖను మనస్సులో చదువుకున్నారు. ఆయనముఖంలో సహజమైన చిరునవ్వు వెల్లివిరిసింది. గంగన్న మనస్సుపై కోడెగాడ్పు హాయిగా వీచింది.

"కుర్రవాడు కులాసాగానే ఉన్నాడు గంగన్నా, నీ పిచ్చిగాని వాడికేం చురకత్తిలాంటివాడు. ఈ యేడు పరీక్షల్లో ఫస్టుక్లాసులో ప్యాసవుతాడు. బాగా చదువుతున్నాడట. పరీక్ష ఫీజూ, హాస్టల్ ఫీజూ కట్టాలిట. రెండొందలు పంపించమన్నాడు" అన్నాడు శివరామప్రసాదు గారు. వెంటనే లాల్చీ ప్రక్కజేబులోనుంచి పర్సుతీసి మూడు వందల రూపాయల నోట్లు తీసి ఇచ్చాడు.

గంగన్న హృదయం సంతోషసాగరం కాగా, కళ్ళల్లో ఆనంద బాష్పాలు తొంగిచూశాయి. రెండుచేతులెత్తి దణ్ణం పెడుతూ - "బాబు గోరూ! మీఋణం ఈ జనమలో తీర్చుకోలేను" అన్నాడు గంగన్న. ఆపైన ఆయనకు ఆనందాతిరేకంలో మాటలు దొర్లలేదు. కృతజ్ఞతా భావంతో హృదయం నిండిపోయింది.

శివరామప్రసాదుగారు సహజ గంభీరంగా నవ్వుతూ అన్నాడు. "సాంబు అభివృద్ధిలోకి రావడం కన్నతండ్రివైన నీకు ఎంతగొప్పో, గర్వ కారణమో, సంతోషమో నాకూ అంతే! జీవితంలో ఒకరికి సహాయం చేసి, అభ్యుదయానికి తోడ్పడిన సంతృప్తి నాకు మిగులుతుంది."

పెదబాబుగారివద్ద సెలవు పుచ్చుకొని గంగన్న నిమ్మతోటకు వెళ్ళ బోతుండగా హఠాత్తుగా చినబాబు కృష్ణప్రసాదు కనబడ్డాడు. "దండా లండి చినబాబుగోరూ! ఎప్పుడొచ్చినారు పట్టణంనుంచి" అన్నాడు గంగన్న దణ్ణం పెడుతూ.

నాయుడిగారింటివద్ద చీట్లపేక ఆడేందుకు హడావుడిగా వెళుతూ కృష్ణప్రసాదు చూసీ చూడనట్టుచూసి "ఊ!" అని నిర్లక్ష్యంగా మూలి గాడు.

శివరామప్రసాదుగారికి ఒక్కడే కొడుకు. బి, ఏ. పంచవర్ష ప్రణా ళికతో పూర్తిచేసి మద్రాసులో బి. యల్. చదువుతున్నాడు. ఆ తండ్రికి తగ్గ కొడుకుకాదు. ఆయనగారి గుణగణాల్లో ఏ ఒక్కటీ అబ్బలేదు. శివ రామప్రసాదుగారిది దృఢమైన విగ్రహం. హోదానీ, వ్యక్తిత్వాన్ని, స్వభా వాన్నీ చెప్పక చెప్పే ఒడ్డూ పొడుగూగల స్వరూపం. సంపదా సాంప్ర దాయం సభ్యతా సంస్కారాల పరస్పర సంఘర్షణవల్ల నిర్ణయమయిన

మనస్తత్వం ఆయనగారిది. ధార్మిక చింతన గలవాడు. అంతరువులకూ ఆడంబరాలకూ ప్రాముఖ్యత నిచ్చే తత్వంకాదు. కృష్ణప్రసాదు కులుకు ప్రాయపు కులాసా పురుషుడు బ్రతికినన్నాళ్ళూ మెర్క్యూరీ కాంతి దీపంలాగ వెలగడమే అతని ధ్యేయం. అంగరంగ భోగాలతో రంగుల రాట్నంవలె తిరగటమే అతని జీవితాశయం. సంపదకూ, సాంప్రదాయానికీ, సభ్యతకూ, సంస్కారాలకూ, సుఖాలకీ పొత్తులేదు. జీవితానికి ముఖ్యమైన ప్రయోజనం సుఖాన్ని సంపాదించుటే! జీవితకాలం పరిమితంగనుక స్వేచ్ఛగా సుఖాన్వేషణ జరిపి వీలైనన్ని మధురానుభూతుల్ని పొంది జీవితాన్ని సార్థకం జేసుకోవాలి. ఆదృక్పథంలో అతని మనస్తత్వం రాటుదేలింది. కృష్ణప్రసాదు కింకా పెళ్ళికాలేదు. చదువు పూర్తి అయ్యాక వివాహం చేద్దామనే అభిప్రాయం తండ్రిగారి కున్నది. అవసరాలు తీరుతున్నాయి గనుక పరోక్షంగా నయినా కృష్ణప్రసాదు పెళ్ళి ప్రసక్తి తీసికొని రాలేదు.

తన కొడుకు దుర్వ్యసనాల పుట్టలాగా తయారయినాడనీ, వంశగౌరవాన్ని, కుటుంబపు పేరు ప్రతిష్ఠల్ని నాశనం చేస్తున్నాడనీ శివరామప్రసాదుగారికి తెలుసు. కృష్ణప్రసాదు అవినీతి పోకడలను అరికట్టేందుకు ఆయనగారు తీవ్ర ప్రయత్నాలు చేయకపోలేదు. కాని లాభంలేకపోయింది. బరితెగిపోయాడు. పై పెచ్చు కృష్ణప్రసాదుకి పిచ్చికోపం మెండు. తను కోరింది లభించకపోతే, తను అనుకున్నట్టు జరక్కపోతే ప్రళయకాల రుద్రుడౌతాడు. తన కోర్కెల ప్రకారం, అభిప్రాయానుసారం ఆలోచించడం నేర్చుకొని, ప్రకృతి అందుకు సహకరించాలనే మొండి పట్టుదలతో వ్యవహరిస్తాడుగాని – విశాలమైన మనస్సుతో ఆలోచించడు వ్యవహరించడు. అందుచేత తరచు ప్రమాద భూయిష్టమైన పరిస్థితుల పద్మవ్యూహంలో ఇరుక్కుంటూవుంటాడు. గుండె ధైర్యంతో, పడద్రోసికొని వెళ్ళే తత్వంతో, అప్పుడప్పుడూ ఆ పరిస్థితుల వలయంనుంచి తప్పించుకొని బయటపడడం కూడా కద్దు. ప్రపంచంలో ఎవర్నీ లెక్క చేయని అహంకారం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొని తన వాంఛల్ని తీర్చుకోగలనన్న ధీమా అతనిలో ఎత్తుగా నిలబడే నైజాన్ని పోషించ సాగినయ్.

మానవ జీవితంలో సంభవించే సంఘటనలన్నీ నిర్ణయాలపై గాక కేవలం విధిపైనే ఆధారపడి వుంటాయి అన్న సూత్రంలో రవ్వంత విశ్వాసం లేదు అతనికి.

ఆ రోజు మునిమాపు ముదిరిన వేళ గంగన్న నిమ్మతోట దగ్గర్నుంచి ఇంటికివచ్చి గుడిసె ముందు మెరాబాలో కట్టుగొయ్యకు కట్టివేసివున్న గేదె పడ్డకు ఓ పన పచ్చిగడ్డి వేస్తూండగా - ప్రక్క పూలతోటలోంచి ఓ స్త్రీ భయపుకేకలు వినబడ్డాయి. గంగన్న కప్పరపడి గబుక్కున పూలతోట గట్టుమీద కెళ్ళాడు. పెదబాబుగారి అబ్బాయి కృష్ణప్రసాద్ యౌవనం తాలూకు మోహం, ఉద్రేకాలు గింగిరాలు తిరుగుతుండగా చాకలి మంగి కూతురు రామిని రెండు రెక్కలూ పట్టుకొని సంపెంగ చెట్టు చాటున బలవంతం చేస్తున్నాడు. "రచ్చించండి బాబూ! ఈ దొంగ సచ్చినోడు నామీదబడి రక్కుతున్నాడు." పేగులా కదిలేట్టు కేకలు వేస్తోంది రామి. పట్టు విడుపించుకోనేందుకు గట్టిగా ప్రయత్నిస్తోంది.

గంగన్న దిగ్భ్రమ చెందాడు. కాలూ, చేయీ, నోరు ఆడలేదు. కొన్ని క్షణాలపాటు గుండె బెండువడిపోయింది. "సినబాబుగోరూ! దాన్నిడిసిపెట్టండి, తప్పుసేయకండి. ఆడగూతుర్ని అన్నాయం చేస్తే దేవుడూరుకోడు" అంటూ గంగన్న మసక చీకటిలో దాపుకెళ్ళేలోపునే రామి చావుకేక పెట్టింది.

నెత్తురుచింది మందార చెట్టుపై పడింది.

గుండెలో దిగబడ్డ చాకుతో రామి గరిక నేలపై వొరిగింది.

ఒళ్ళెరగని క్రోధం చప్పగా జారిపోగా భయవిహ్వలుడై గబగబా మేడకేసి పరుగెత్తాడు కృష్ణప్రసాదు.

తోటలోని పువ్వులూ, చెట్లూ, "అయ్యో! పాపం" అనుకున్నాయి. జరిగినదానికి సానుభూతిగా మౌనం వహించాయి.

గాలి క్షణంలో సగంసేపు స్తంభించింది.

"ఇట్లాంటి ఘోరమైన హత్యల్ని నేను చాలా చూశాను" అన్నట్లు చీకటి కళ్లు ఆర్పింది.

గత్తరపడిపోయాడు గంగన్న. ఇంత ఘోరాతిఘోరమైన అన్యాయాన్ని కళ్ళతో ఎన్నడూ చూడలేదు. నిట్టాడిబద్దలా గట్టుపై కొన్ని క్షణాలపాటు నిర్ఘాంతపోయి నిలబడ్డాడు. ఆపైన పిసరంత తేరుకొని, గడగడ వణికే కాళ్ళతో మేడదగ్గర కెళ్ళి షావుకారుగారితో చెప్పాడు. అప్పటికి కృష్ణప్రసాదు ఇంటిలోనుంచి అందినమట్టుకు డబ్బు చేత పుచ్చుకొని, ఎవ్వరితోనూ చెప్పకుండా వూరుదాటాడు.

శివరామ ప్రసాదుగారు నిశ్చేష్టుడై కుర్చీలో నీలుక్కుపోయాడు. ఆ చీకటిలో తోటలోకి వచ్చి రామి పరిస్థితి చూసేసరికి ఆ విషయం ఆనోట ఆనోట పాక్కి ఊరంతా పొగలాగ వ్యాపించింది. ఆగుబ్బుగా చెప్పుకుంటూ అప్పటి కప్పుడే జనం వచ్చిపడ్డారు తోటలోకి.

ఆ రాత్రే రామి మరణించింది.

పోలీసుకేసు పెట్టారు కృష్ణప్రసాదుమీద. అతన్ని పట్టుకునేందుకు విపరీతంగా ప్రయత్నాలు చేశారు. చివరకు హైదరాబాదులో ఓ మారుమూల హోటల్లో అతన్ని పట్టుకొని అరెస్టుచేశారు.

సెషన్సుకోర్టులో కేసు విచారణ కొచ్చింది.

* * *

హత్య జరిగినప్పుడు ప్రత్యక్షంగా చూసింది ఒక్క గంగన్నే. ఆ చూడటం అకస్మాత్తుగా జరిగినప్పటికీ, ఎంతో దురదృష్టంగా దురపిల్లాడాయన. అడకత్తెరలో పోకపరిస్థితి ఏర్పడింది.

అవతలవాళ్ళు గంగన్ననే ప్రధాన సాక్షికింద పెట్టారు. ఆయన షావుగారు శివరామప్రసాదుగారి ఉప్పుతిని బ్రతుకుతున్నప్పటికి యజమాని శ్రేయస్సును అక్షరాల కాంక్షించే వ్యక్తియైనప్పటికి, స్వామిభక్తిపరుడైనప్పటికి, సాక్షిగా పెట్టుకోవడంలో ముఖ్యకారణం, ఆయన నీతి, నిజాయతీలపై వాళ్ళకి ప్రగాఢ విశ్వాసముండటంవల్లనే. ఒకరోజు రామి తండ్రి రామప్ప, మేనమామ ముత్తయ్యా గంగన్న దగ్గరకొచ్చారు.

“గంగన్నా నువ్వు మాతట్టు వత్తాసు రానక్కర్లా! కళ్లారా ఏం చూశావో, అసలేం జరిగిందో ఉన్నదున్నట్టుగా కోరుటులో సెప్పు. నువ్వు

నిఖార్సయిన మడిసివనీ, అన్నాయపుకూటి కాసపడి తప్పుడుసాక్ష్యం చెప్పవనీ మాకు గురివుండాది. అందుసేత నే నిన్ను సాచ్చిగా పెట్టినాము. నీలో దేవుడుండాడు. నీమనసు పవిత్రమైనాది. ఒకయేల నువు పెదబాబుగోరి వొత్తిడికి తట్టుకోలేక తప్పుడుసాచ్చం చెప్పాలనుకున్నా – ఆదేవుడూరుకోడు. ఔగాములు తెల్సిన మెదడు నీది. పరిగెత్తి పాలుతాగే బుద్ధి కాదు. బీదోళ్ళకి న్యాయ మొక్కటే యీ లోకంలో అండ" అన్నాడు రామన్న గుండె చరుచుకుంటూ.

గంగన్న దీర్ఘాలోచనుడై నిమ్మకు నీరెత్తినట్లు నిర్లిప్తంగా మౌనం వహించాడు. భరవాసాగా రామప్పవాళ్ళు వెళ్ళిపోయారు.

సూర్యుడు పొమ్మసిల్లగా, ఎండ పల్చబడింది. కడప్రొద్దుకు పచ్చని పొలాలు తలలెత్తి ముచ్చటలాడుకుంటున్నాయి. గుడిసెముందు మెల్లా మీద ఈతాకుల చాపపైకూర్చుని పలుపుతాడు పేనుతున్నాడు గంగన్న. కొబ్బరిచెట్ల ఆకులు గాలికి రొదచేస్తున్నాయి.

గంగన్న మనస్సు అగలూపాగలుగావుంది. మనిషిలోని భగవంతుని ఉనికియైన అంతఃకరణతో అమీతుమీ తేల్చుకోవాల్సిన అగత్యమేర్పడింది. మనస్సును అటు సత్యం ప్రక్కకో ఇటు అసత్యంవైపుకో మళ్ళించుకొనే అవకాశాన్ని దేవుడు ప్రతివారికి ఇస్తాడు. ఆ అవకాశాన్ని వినియోగించుకోవడంలోనే వుంది మానవుని గొప్పతనం. సత్యాన్ని గురించి అందరూ ఉద్ఘాటిస్తారు; కాని సత్యంతో ఘర్షణపడి ఆడుకొనేది బహుకొద్దిమంది. ఆ జూదంలో జయాపజయాలు మానసిక వ్యవస్థపై ఆధారపడి వుంటాయి.

షావుకారు శివరామప్రసాదుగారు వస్తూవుండడాన్ని అంతదూరంలో చూసి చివుక్కున లేచినిలబడ్డాడు గంగన్న. పొందూరు ఖాదీ ధోవతీ, ఖద్దరు సిల్కు లాల్చీ ధరించి, రోల్డుగోల్డు ఫ్రేం కళ్ళజోడు పెట్టుకొని, మెడలో వెంకటేశ్వరస్వామివారి లాకెట్ గల బంగారపు రాళ్ళగొలుసు వ్రేలాడుతూండగా, వెండి పన్నుగల గంధపు చేతికర్రను త్రిప్పుతుంటూ ఒక్కరే వచ్చారు.

గంగన్న చిత్తం చీకటి గొల్పింది.

రెండు చేతులూ జోడించి, వినయ విధేయతలతో వొణికే శరీరంతో నమస్కరించి "బాబుగోరూ! మీరీడకు రావాల్సిన పనేటిది! కాకతో కబురెడితే రెక్కలు గట్టుకొని మీకాడ వాలేవాడ్ని" అన్నాడు గంగన్న.

షావుకారుగారు కృత్రిమంగా నవ్వారు.

"నీతో నాకు పనివుండి వచ్చాను గంగన్నా! అట్లాంటప్పుడు నేనే స్వయంగా రావడం నా ధర్మం గదా!'' అంటూ గుడిసె దడిప్రక్కనున్న నులక మంచాన్ని వాల్చుకొని కూర్చున్నారు శివరామ ప్రసాదుగారు.

చేతులు పట్టుకొని వంగి నిలబడ్డాడు గంగన్న.

"మీ చేతికింద నీళ్ళు తాగేవోణ్ణి. మీ దయతో బతికేవాణ్ణి. మీకు నాతో పనుంటే మట్టుకు మీరే రావాలా బాబుగోరూ! గాలితో కబురు చేసినా వొచ్చేవాడ్నేగా!''

షావుకారుగారు కొన్ని క్షణాలపాటు నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఆయనగారి ముఖంలో చీకటినీడలు కుస్తీ పడుతున్నాయి. అత్యంత చింతా పూర్వకమైన వ్యాకులతతో నిండివుంది. యజమాని వాలకం గంగన్న మానసిక స్థితిని జాలితో జావలాగ మార్చివేసింది.

"గంగన్నా!'' అన్నారు షావుకారుగారు. ఆ స్వరంలో శోకో ద్విగ్నత కొట్టవచ్చినట్టు కనిపించింది.

"అయ్యా!''

"నా బ్రతుకూ, త్యాగమూ, పరువు ప్రతిష్ఠలూ, వంశ గౌరవమూ - అన్నీ నీ చేతుల్లో ఉన్నాయి. రేపు నువ్వుకోర్టులో చెప్పే సాక్ష్యంపై ఆధారపడివున్నాయి. కృష్ణప్రసాద్ దుర్మార్గుడు కావచ్చు. అవినీతిపరుడు కావచ్చు - హంతకుడు కావచ్చు, కాని, వాడు నాకు ఒక్కగా నొక్క కొడుకు. వంశానికి వారసుడు. వాడికి శిక్ష పడితే నాకు శిక్షపడి నట్లే, వాడి అపకీర్తి నాకు అపకీర్తి. వాడు నాశనమైతే నేను నాశన మైనట్లే! పుత్రభిక్షకోసం నీ దగ్గర కొచ్చాను. నన్ను కాపాడు గంగన్నా! ఈ గండంనుంచి తప్పించు. నీ మేలు మర్చిపోను'' దుఃఖో

ద్వేగంతో షావుకారుగారికి కళ్ళనీళ్ళు బొటబొట దొర్లి చెంపలపై నిల్చాయి.

ఆ కన్నీటికి గంగన్న కర్పూరంలా కరిగిపోయి, అమాంతంగా షావుకారుగారి కాళ్ళపై బోర్లాపడి భోరున ఏడ్చాడు.

రేపటి దినాన గంగన్న కోర్టుకువెళ్ళి సాక్ష్యం చెప్పాలి. ఊరంతా నీ రెండవంటి ఉత్సాహంతో ఉంది - గంగన్న ఎట్లా సాక్ష్యం చెబుతాడో నని. న్యాయానికి బద్ధుడై నిజం చెబుతాడో, షావుకారుగారి మోచేతి నీళ్లు త్రాగుతూన్నందుకు కృతజ్ఞతను జ్ఞాపకచిహ్నంగా భావించి కూట సాక్ష్యం పలుకుతాడో!

*　　　*　　　*

కోర్టంతా కోలాహలంగాఉంది. ఆ వూరి జనం చాలామంది గంగన్న సాక్ష్యాన్ని వినేందుకు వచ్చారు.

జడ్జీగారి రాకతో కోర్టు హాలులో నిశ్శబ్దం నిద్రలేచింది.

గంగన్న బోను ఎక్కాడు. దేవుని ఎదుట నిజమే చెబుతానని ప్రమాణం చేశాడు. పెనుతుపానును సూచించే వాతావరణపు గంభీరత్వం ఆయనలో మూర్తీభవించి వుంది. నిజమే చెబుతాడేమో! ఆయనయొక్క సత్యాత్మ తప్పుడు సాక్ష్యానికి నాలుకకు అనుమతి ఇవ్వదేమో!... ఏమౌతుందో! అవతలతట్టు లాయరుగారు ప్రశ్నలు వేస్తున్నాడు. జడ్జీగారు శ్రద్ధగా వింటున్నారు. పూచికపుల్ల కదిలినా వినిపించే నిశ్శబ్దం కోర్టు హాలులో రాజ్యం చేస్తోంది.

... ... ... ...

"ఆ హత్య జరిగినప్పుడు నువ్వు అక్కడే ఉన్నావా, గంగన్నా?"

"లేను—"

"ఆ హత్యను కళ్ళారా చూశావా?"

"నేను అక్కడ లేకుంటే ఎట్లా చూస్తాను!"

"మరెక్కడున్నావు?"

"కాకినాడ పోయాను, మా అబ్బాయికి డబ్బులిచ్చి రావడానికి. వాడు రెండొందలు కావాలని ఉత్తరం రాశాడు. పెదబాబుగారివద్ద ఆడబ్బు తీసికొని ఆమద్దినేల బయల్దేరి రైలు కెళ్ళాను. ఆ రాత్రి ఊళ్ళోనే లేను."

గంగన్న అబద్ధపు సాక్ష్యం చెప్పాడు.

కోర్టు హాలులో సన్నగా సవ్వడి బయలుదేరింది. ఆ వూరివాళ్ళు గంగన్న సాక్ష్యానికి గంగవెర్రులెత్తి, గుసగుసలాడుకోసాగారు.

గంగన్న ఎంత మారిపోయాడు? నీతి నిజాయితీలకు నిప్పులాంటి మనిషి. ధర్మకాటా లాంటి మనస్సుగల వ్యక్తి - ఎట్లా దిగజారిపోయాడు. అసత్యంవల్ల ఎట్లాంటి ఆపదా సంభవించదనుకున్నప్పుడు - ఎట్లాంటి మానవుడు కూడా అసత్యానికి వెనుదీయడన్నమాట. షావుకారిగారి మీదగల అత్యధిక ప్రేమాభిమానాలతో, భక్తిశ్రద్ధలతో కరుణాత్మక కృతజ్ఞతా భావంతో గంగన్నకూడా సాక్ష్యం పలికివుండవచ్చు. తన నీతి నిజాయితీల్ని యజమాని సంతోషంకోసం త్యాగం చేశాడు. ఆయన త్యాగం అసమాన్యమైనట్టిది. ఒకళ్ళ బ్రతుకుకోసం, సంతృప్తికోసం - తన ఆత్మను చంపుకున్నాడు; నైతికవిలువల్ని మంటగల్పుకున్నాడు; సాంఘిక పతనం చెందాడు; మనోధర్మాన్ని మలినబర్చుకొని మానసికమయిన అశాంతితో మెలిదిరిగిపోయాడు.

గంగన్న తప్పుడు సాక్ష్యంతో కేసు కొట్టివేయబడుతుందనీ, కృష్ణప్రసాదు విడుదల చేయబడతాడనీ అందరూ వూహించారు.

కాని కోర్టువారు గంగన్న సాక్ష్యాన్ని నమ్మలేదు.

కృష్ణప్రసాదుకు మరణశిక్ష పడింది.

ఫలానా రోజు కృష్ణప్రసాదును ఉరిదీస్తారు. వచ్చి చూడవల్సిందని జెయిల్ అధికారులనుంచి వర్తమానం వచ్చింది. ఆ లేఖను చూసి...

— షావుకారు శివరామప్రసాదుగారు ఉలిక్కిపడి నిద్రనుంచి లేచారు.

అర్థ రాత్రి జీరోబల్బు మసక కాంతిలో - గది నిశ్శబ్దంగా వుంది. ఎట్లాంటి కలవచ్చింది? మంచందిగి, లైటువేసి, గదిలో పచార్లు చేయ సాగాడు షావుకారుగారు.

మనస్సంతా చీకటి గుయ్యారం వలెఉంది. మనశ్శాంతిని కలిగించే శాంతికోసం ఆయనగారి మస్తిష్కపు పరిశోధనాలయంలో తీవ్రమైనకృషి జరుగుతోంది. అంతర్గత శక్తుల మధ్య పదునైన సంఘర్షణ బయలుదేరింది.

గంగన్నది మచ్చలేని మనసు. నిష్కల్మష హృదయం. పవిత్రమైన అంతరాత్మ. అట్లాంటి మనస్సునూ, హృదయాన్నీ, అంతరాత్మనూ తను కేవలం కొడుకుపై ఆపేక్షతో ఆదరాభిమానాల ఆవేశంతో, కనిపెంచిన మమకారంతో - పాడుజేయబూనుకున్నాడు. తన కోసం, తన క్షేమం కోసం గంగన్న కూడ సాక్ష్యం పలుకవచ్చు. తను గంగన్న కుటుంబానికి చేస్తూన్న సహాయానికీ చూపుతున్న ఆదరణకూ కృతజ్ఞతా సూచకంగా తప్పుడు సాక్ష్యం చెప్పవచ్చు. కాని ఏం సబబు? స్వార్థంకోసం, కృతజ్ఞతా స్వీకరణకు కనిపెంచిన మమతల కొరకూ, నీతినిజాయితీలు నిండుగా గల ఒక వ్యక్తిని బలవంతాన నైతిక పతనం గావించుట ఏంబావుంటుంది? అన్యాయాచరణవల్ల తాత్కాలిక సుఖశాంతులు లభిస్తాయిగానీ. తర్వాత ప్రాప్తమయ్యే అనుభూతులూ, ఆలోచనలూ దుఃఖభూయిష్టాలు. అన్యాయాన్ని అనుభవించడం కంటె - అన్యాయానికి పాల్పడటం ఎక్కువ తలవంపు; దుఃఖహేతువు; భగవంతుని దృష్టిలో నేరము. తాత్కాలికోద్రేక సంప్రేరితుడై కృష్ణప్రసాదు హత్యచేశాడు. అది నేరం. ఆ నేరానికి ప్రత్యక్షసాక్ష్యం బలం. ఆ సాక్ష్యబలాన్ని ఆధారంగా చేసికొని న్యాయస్థానం నేరస్థునికి శిక్ష విధిస్తుంది. నేరంచేశాడు గనుక కృష్ణప్రసాదు శిక్ష అనుభవించాల్సిందే! తను తాపత్రయపడి అన్యాయానికి పాల్పడి గంగన్నచేత అబద్ధ సాక్ష్యం చెప్పించినా, వాడికి న్యాయస్థానపు శిక్ష తప్పినా రేపు భగవంతుడు విధించే శిక్షనుంచి తను వాణ్ని కాపాడగలడా? తను గంగన్న ఆత్మనిశ్చయాన్ని, హృదయ ధర్మాన్నీ, మానసిక స్వేచ్ఛను అరికట్టి ప్రయోజనం లేదు. భగవంతుడు సత్యస్వరూపుడు. ఈ అనంతమైన కాంతి ఆయన నీడ. దృఢమైన చిత్త

వృత్తితో, నిర్మలాంతఃకరణతో ఫలాపేక్ష రహితంగా ఎవరైతే సత్యం పలుకుతారో, బాధ్యతల్ని సక్రమంగా నిర్వహిస్తారో వారికే భగవంతుని అండదండలు. వారే దయాదాక్షిణ్యాలకు పాత్రులవుతారు. వారికే స్వచ్ఛమైన ఆనందం లభిస్తుంది. సత్వర దృష్టిగల గంగన్న చేత ప్రోద్బలంతో అసత్యం పలికించడం తన అవివేకం. నేరంకూడాను. తను గంగన్నతో చెప్పాలి నిర్భయంగా నిజం పలకమనీ, తప్పుడు సాక్ష్యం కూడదనీ, కృష్ణప్రసాదుకి న్యాయస్థానం ఏ శిక్ష విధించినా తను ఆదుర్దా పడటం లేదనీ, అట్లాంటి మానసిక నిశ్చయానికి వచ్చాక మనస్సు తేటబడి షావుకారు శివరామప్రసాదుగారు ఆ అర్ధరాత్రి దాటాక కొంచెం సేపు నిద్రబోయాడు.

సూర్యోదయానికి ముందే సూర్యోదయమైన మనస్సుతో నిద్రనుంచి లేచాడు షావుకారుగారు. సత్వరం మేడమెట్లుదిగి తోటలోకి వచ్చాడు.

తెల్ల గులాబీలా ఉంది తెలతెలవారుతూన్న ప్రకృతి.

గంగన్న గుడిసె దగ్గరకు వెళ్ళి "గంగన్నా!" కేక వేశాడు శివరామ రామప్రసాదుగారు. గంగన్న పలుకు లేకపోయేసరికి తనలాగే రాత్రంతా ఆత్మతో సంఘర్షణపడి అలసి నిద్రపోతున్నాడేమో ననుకుంటూ గుడిశె తడికె తలుపు త్రోసుకుంటూ లోపలికి వెళ్ళాడు షావుకారు.

రెండు నిట్టాడిపట్టెలకూ అడ్డపట్టెలావున్న తాటిదూలానికి వ్రేలాడుతున్న గంగన్న శవాన్ని చూసి శివరామప్రసాదు కెవ్వున కేక వేశాడు.

(ఆంధ్ర జ్యోతి)

—o—